RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




RANGAREDDY, EDITION : 01, VOLUME :175 EDITOR: CHERUKU UPENDAR, DATE : THURSDAY 09 NOVEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 175 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 09 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-



### కొలీజియం సిఫార్సులన్నింటినీ
## ఆమోదించాలి

- ప్రభుత్వానికి నచ్చిన వారినే ఎంపిక చేయకూడదు
- సెలెక్టివ్‌గా నియామకాలు జరిగితే సీనియారిటీ క్రమానికి విఘాతం కలుగుతుంది
- ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుంటే... ఉత్తర్వుల జారీ వెనుకాడబోం
- సుప్రీంకోర్టు ధర్మాసనం


న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన కొలీజియం ప్రతిపాదనల పేర్లను ఆమోదించే సమయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న 'పిక్ అండ్ సెలెక్ట్' విధానంపై సుప్రీంకోర్టు మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయమూర్తుల కోసం సిఫార్సు చేసిన వారి సీనియారిటీకి ఈ విధానం

మిగతా 2లో

# కాంగ్రెసోళ్లను నమ్మొద్దు

- గిరిజనేతరులకు పోడు పట్టాల కోసం కేంద్రంతో పోరాడతాం
- ఇంటింటికి నీళ్లు, 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- అభ్యర్థి గుణగణాలు, పార్టీ చరిత్ర తెలుసుకుని ఓటేయండి
- ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్




మంచిర్యాల - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో ఇప్పటికే గిరిజనులకు వేల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చామని, పోడు కేసులనూ ఎత్తేశామని, గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలివ్వాలని అనుకుంటున్నా కేంద్రం అడ్డుపడుతోందని, ఎన్నికల తర్వాత దాని కోసం కేంద్రంతో పోరాడుతామని సీఎం కేసీఆర్ తెలిపారు. బుధవారం కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. పోడు రైతులకు పట్టాలివ్వడమే కాకుండా వారికి రైతుబంధు, రైతు బీమా అమలు చేస్తున్నామని తెలిపారు. గత పదేండ్లుగా అధికారంలో ఉండి గత ప్రభుత్వాలు చేయని ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు చేసి చూపించామన్నారు. 24 గంటల కరెంట్ అవసరం లేదని, ధరణిని తీసి బంగాళాఖాతంలో వేయాలని కాంగ్రెసోళ్లు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణిని తీసేస్తే మళ్లీ పైరవీకారుల వ్యవస్థ వస్తుందన్నారు. 30న జరిగే ఎన్నికల్లో అభ్యర్థి గుణగణాలతో పాటు ఆ అభ్యర్థి వెనుక ఉన్న పార్టీ చరిత్ర తెలుసుకొని ఓటేయాలని సూచించారు. పీసీసీ అధ్యక్షులు టికెట్లు

మిగతా 2లో

### చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై
## విచారణ వాయిదా



అమరావతి - ప్రభాత సూర్యుడు

ఉచిత ఇసుక విధానం వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లిందనే ఆరోపణతో సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ టిడిపి అధినేత చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసిన ఉన్నత న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.రాజకీయ కార్యకలాపాలకు తనను దూరంగా ఉంచాలని, న్యాయవిచారణ ప్రక్రియలో మునిగిపోయేలా చేయాలని, వేధించాలన్న ఏకైక ఉద్దేశంతో ఈ కేసు నమోదు చేశారని పిటిషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. 'వైసిపి పాలనలో ఇసుక అక్రమాలు, అవినీతిపై నేను, ఇతర ప్రతిపక్ష నేతలు గళమెత్తుతున్నాం. మా నోళ్లు మూయించాలనే కేసు పెట్టారు. మేం ప్రభుత్వ అక్రమాలపై గొంతెత్తుతున్న అంశాలను ముడిపెట్టి మాపైనే తప్పుడు కేసులు నమోదు చేశారు. ప్రభుత్వం ప్రతీకారానికి పాల్పడుతోంది'

# బీజేపీకి ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్టే..!

- అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు
- ఆదిలాబాద్, ఉట్నూర్ విజయభేరీ సభల్లో రేవంత్‌రెడ్డి

ఆదిలాబాద్- ప్రభాత సూర్యుడు



ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చిన ప్రతి సారి కేసీఆర్ అవినీతిని ప్రస్తావిస్తారని, కానీ నిత్యం అవినీతి నెపం మోపి విపక్షాల పైకి ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను పంపిస్తున్న మోడీ.. కేసీఆర్ అవినీతిని ఎందుకు పట్టించుకోవడం లేదని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనన్నారు. కేసీఆర్ కుటుంబంలో అందరికీ పదవులు ఉన్నాయని, మూడోసారి సీఎం అయితే తన మనవడిని కూడా మంత్రిని చేస్తారని ఎద్దేవా చేశారు. లక్ష కోట్లు దోచుకొని.. పేదల భూములు లాక్కొని, ఈ రాష్ట్రాన్ని అమ్ముకొని దేశం విడిచి పారిపోతారని విమర్శలు గుప్పించారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల కమీషన్లకు కక్కుర్తిపడి నిర్మించిన కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని, అన్నారం పగిలిపోయిందని, సుందిళ్ల బ్యారేజీ ఎప్పుడు కొట్టుకుపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతం చేసేందుకు ఈ ఎన్నికలు ఒక అవకాశమని, దాన్ని ఉపయోగించుకొని ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్, ఉట్నూర్ నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడిహేటీ వద్ద ప్రాణహితపై ప్రాజెక్టు నిర్మించి ఈ జిల్లాలో 1.60లక్షల ఎకరాలకు సాగునీరందించాలని ఉమ్మడి రాష్ట్ర సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భావించారని గుర్తుచేశారు. కానీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టు ఇక్కడ కాదని.. కాళేశ్వరంకు తరలించారని తెలిపారు. ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ ఏం చేసిందని మంత్రి హరీశ్‌రావు అంటున్నారని ఆయన్ను ఎమ్మెల్యే కాకముందే మంత్రిని చేసిన విషయం గుర్తించుకోవాలని హితవు పలికారు. తెలంగాణలోని నిధులు, నీళ్లు, నియామకాలు ఈ ప్రాంతానికే దక్కాలని సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లు అమ్ముకుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కోట్ల రూపాయలు ఉన్నోళ్లకే బీఆర్ఎస్ టికెట్లు ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్‌లో ఆశావహులు ఎక్కువగా

మిగతా 2లో

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే

### పారిశ్రామికవేత్తలతో భేటీలో కేటీఆర్





హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పరిశ్రమల అనుమతి కోసం ఢిల్లీకి వెళ్లాలి. వారిని ఒప్పించాల్సి ఉంటుందని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. ఆ పార్టీకి ఓటేస్తే కష్టాలే అన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ ఇండిస్ట్రియలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పారిశ్రామికవేత్తల సమావేశంలో కేటీఆర్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలుగా కాకుండా పౌరులుగా బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలని కోరారు. తెలంగాణ వారికి పరిపాలన రాదనీ, అంధకారం అలుముకుంటుందనీ, భూముల విలువ పడిపోతుందని నాడు ఎన్నో విమర్శలు చేశారని గుర్తుచేశారు. తెలంగాణకు ముందు విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండేదనీ, ప్రస్తుతం 10 నిమిషాలు కరెంట్ పోతే తట్టుకోలేక పోతున్నామని తెలిపారు. కర్నాటక డిప్యూటీ సీఎం డీ.కె.శివకుమార్ ఆ రాష్ట్రంలో ఐదు గంటలు కరెంట్ ఇస్తున్నట్టు చెబితే వచ్చిన వారంతా నవ్వుకున్నారని తెలిపారు. 2014కు ముందు నగర శివారుల్లో 14 రోజులకు

మిగతా 2లో

### ఇండోనేషియాలో
## శక్తివంతమైన భూకంపం


జకార్తా - ప్రభాత సూర్యుడు




ఇండోనేషియాలో బుధవారం ఉదయం శక్తివంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 6.9గా నమోదైనట్లు యూరో పియన్ మధ్యధరా సిస్మోలాజికల్ సెంటర్ (ఇఎం ఎస్‌సి) తెలిపింది. భూకంపం ఇండోనేషియాలోని అంబన్‌కు ఆగేయంగా 370 కి.మీ దూరంలో ఉందని, 146 కి.మీ లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు ఇఎంఎస్‌సి పేర్కొంది. ఆ తర్వాత కూడా వరుసగా ప్రకంపనలు వచ్చినట్లు ఇండోనేషియా వాతావరణ, భూభౌతిక విభాగం తెలిపింది. అయితే సునామీ ప్రమాదం లేదని ప్రకటించింది.

### జగన్, సిబిఐ, సిబిఐ
## కోర్టులకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్ - విజయనేత్ర



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, సిబిఐ న్యాయస్థానికి, సిబిఐకి తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై సిబిఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికలలోగా తేల్చాలని మాజీ ఎంపి హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రావణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌ను పిల్‌గా పరిగణించేందుకు మొదట హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరాలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం సిఎంగా ఉన్నారని, ఆయనపై

మిగతా 2లో

### గజ్వేల్, కామారెడ్డిలలో...
## సీఎం కేసీఆర్ నామినేషన్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రేపు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయన గజ్వేల్, కామారెడ్డిలలో పోటీ చేస్తున్నారు. 9న గురువారం రెండుచోట్ల ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు. తొలుత గజ్వేల్, ఆ తర్వాత కామారెడ్డికి వెళ్తారు. ఉదయం గం.10.45 నిమిషాలకు ఎర్రవెల్లి ఫామ్ హౌస్ నుంచి హెలికాప్టర్ ద్వారా గజ్వేల్‌కు బయలుదేరుతారు. గం.10.55కు గజ్వేల్‌లో ల్యాండ్ అవుతారు. మధ్యాహ్నం గం.11 నుంచి గం.12 మధ్య నామినేషన్ దాఖలు చేస్తారు. ఆ తర్వాత తిరిగి ఫామ్ హౌస్ చేరుకొని భోజనం చేస్తారు. మధ్యాహ్నం

మిగతా 2లో

### జగన్, సిబిఐ, సిబిఐ
## కోర్టులకు హైకోర్టు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

పెండింగ్‌లో ఉన్న కేసులు చాలా తీవ్రమైనవని పిటిషనర్ తరుపు న్యాయవాది రాధాకృష్ణ కోర్టు దృష్టికి తెచ్చారు. తన క్లయింట్ దాఖలు చేసిన పిల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోర్టును కోరారు. పిటిషనర్ వాదనతో ఉన్నత న్యాయస్థానం ఏకీభవి పిల్‌కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

## 'నేర' చట్టాల సవరణ బిల్లులకు స్థాయీ సంఘం ఆమోదం
### అసమ్మతి తెలిపేందుకు సమయం కోరిన ప్రతిపక్ష సభ్యులు

న్యూఢిల్లీ - విజయనేత్ర

ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రోసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), ఎవిడెన్స్ చట్టాలను మార్చడానికి ఉద్దేశించిన మూడు బిల్లులను పరిశీలించిన హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికలను ఆమోదించింది. ప్యానెల్‌లోని ప్రతిపక్ష సభ్యులు భిన్నాభిప్రాయాలను సమర్పించి నప్పటికీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే బిల్లుల్లో పలు మార్పులు చేయాలని నివేదిక సూచించినట్లు తెలిసింది. కేంద్ర మాజీ హోం మంత్రి పి. చిదంబరం సహా కొందరు సభ్యులు అసమ్మతి నోట్లు సమర్పించేందుకు మరికొంత సమయం కోరారు. వారికి బుధవారం వరకు గడువు ఇచ్చారు. చిదంబరం, టిఎంసి సభ్యులు డెరెక్ ఓ బ్రియాన్, కకోలి ఘోష్ దస్తిదార్ సవివరమైన అసమ్మతి నోట్‌లను సమర్పిస్తారని ప్రతిపక్ష వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్‌కు చెందిన అధిర్ రంజన్ చౌదరి, దిగ్విజయ సింగ్, డీఎంకేకు చెందిన ఎన్ఆర్ ఎలాంగో సహా పలువురు సభ్యులు ఇప్పటికే అసమ్మతి నోట్లు సమర్పించారు. ప్యానెల్‌లోని మొత్తం 10 మంది ప్రతిపక్ష సభ్యులు వేర్వేరుగా అసమ్మతి నోట్లు సమర్పించనున్నట్లు వర్గాలు తెలిపాయి. సోమవారం జరిగిన సమావేశంలో చిదంబరం పలు సూచనలు చేస్తూ సుదీర్ఘంగా మాట్లాడినట్లు తెలిసింది. బిల్లుల్లో హిందీని ఉపయోగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ప్రతిపక్ష సభ్యుల్లో కొందరు అభిప్రాయపడ్డారు. అయితే బిల్లులకు ఇచ్చిన హిందీ పేర్లను కమిటీ పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతిని మార్చుతూ తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత, చిన్న దొంగతనం, పరువు నష్టం, ఆత్మహత్యాయత్నం వంటి కొన్ని నేరాలకు శిక్షకు ప్రత్యామ్నాయ రూపంగా సమాజ సేవను సూచించింది. కొంతమంది సభ్యులు కమిటీ సమాజ సేవను నిర్వచించాలని, అది ఊహించినదంతా చేయాలని కోరారు. అంతేకాకుండా, కొంతమంది సభ్యులు ఇప్పుడు కొత్త శిక్షా చట్టం కింద ఉగ్రవాదం, అవినీతి, వ్యవస్థీకృత నేరాలను తీసుకురావడానికి అనుకూలంగా లేరు.

## బీజేపీకి ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్టే..!

(మొదటిపేజీ తరువాయి)

ఉండటంతో అందరికీ అవకాశం ఇవ్వలేం కదా అని తెలిపారు.

**కేసీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారు..!**

ధరణి తీసేస్తే రైతుబంధు రాదని.. ఉచిత కరెంటు మూడు గంటలే ఇస్తామని తాను అన్నట్టు కేసీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 2018లో రైతుబంధు అమలైతే 2020లో ధరణి పోర్టల్ వచ్చిందని, మధ్యలో రెండేండ్ల పాటు రైతుబంధు ఆగిందా అని ప్రశ్నించారు. ప్రస్తుతం 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని సీఎం చెబుతున్నారని, సబ్‌స్టేషన్లకు వెళ్లి లాగ్‌బుక్‌లు పరిశీలిద్దామని.. 24గంటలు ఇస్తున్నట్టయితే నాతో పాటు అభ్యర్థి కూడా నామినేషన్లు వేయబోమని సవాల్ విసిరారు. ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి కంటే మెరుగైన పోర్టల్ తీసుకొస్తామని, రైతుభరోసా కింద ఎకరానికి రూ.15వేల చొప్పున రైతులు, కౌలు రైతులకు అందజేస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ రూపొందించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, హస్తం పార్టీని ఆదరించాలని కోరారు. ఆదిలాబాద్, ఉట్నూర్ అభ్యర్థులు కంది శ్రీనివాస్‌రెడ్డి, వెడ్మ బొజ్జుపటేల్‌లను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురు బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, కర్నాటక ఎమ్మెల్సీ ప్రకాష్‌రాథోడ్, నాయకులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, గిమ్మ సంతోష్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

### కొలీజియం సిఫార్సులన్నింటినీ
# ఆమోదించాలి

(మొదటిపేజీ తరువాయి)

కలిగించిందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'ఈ పిక్ అండ్ సెలెక్ట్ ఆపివేయాలి. ఇది ఆఫ్ హ్యాండ్ రిమార్క్ కాదు' అని కోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో కొలీజియం సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రశ్నిస్తూ బెంగళూరు న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంజరు కిషన్ కౌల్, సుధాన్షు ధులియాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుంటే ఈ అంశంపై ఉత్తర్వులు జారీ చేసేందుకు వెనుకాడబోమని న్యాయమూర్తులు తెలిపారు. 'కొలీజియం సిఫార్సుల ఆమోదించడంలో పురోగతి లేకపోవడంపై మేము అటార్నీ జనరల్ వద్ద ఆందోళన వ్యక్తం చేశాం. పెండింగ్‌లో ఉండటం చాలా ఆందోళన కలిగించే అంశం. కొలీజియం సిఫార్సుల్లో ప్రభుత్వం ఎంపిక చేస్తున్నందున ఇది చాలా ఆందోళన కలిగిస్తుంది. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అటార్నీ జనరల్ తెలిపారు.

గత పరిస్థితి రాకూడదని మేము ఆశిస్తున్నాము. కొలీజియం లేదా ఈ కోర్టు ఆమోదయోగ్యం నిర్ణయాన్ని తీసుకుంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టుల నియామకాల కోసం సుప్రీంకోర్టు కొలీజియం న్యాయమూర్తుల పేర్లను ప్రతిపాదించినప్పుడు, ప్రభుత్వం, ప్రతిపాదిత పేర్ల నుండి ఎంపిక చేసుకునే బదులు, కొలీజియం చేసిన సిఫార్సుల క్రమంలో న్యాయమూర్తులను క్లియర్ చేయాలని కూడా ధర్మాసనం సూచించింది.

పంజాబ్, హర్యానా హైకోర్టులను ఉదాహరణను ఉదహరించిన ధర్మాసనం 'సుప్రీంకోర్టు కొలీజియం పంజాబ్, హర్యానా హైకోర్టులకు ఐదుగురు న్యాయవాదులను పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసింది. సీరియల్ నెంబర్ 1, 2లో ఉంచబడిన పేర్లను విస్మరించి, కేంద్రం కేవలం ముగ్గురి పేర్లను మాత్రమే క్లియర్ చేసింది' అని ధర్మాసనం పేర్కొంది. సెలెక్టివ్‌గా నియామకాలు జరిగితే సీనియారిటీ క్రమానికి విఘాతం కలుగుతుందని, తద్వారా యువ న్యాయవాదులు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టేందుకు అనువుగా ఉండదని ధర్మాసనం పేర్కొంది.

పెండింగ్‌లో ఉన్న పేర్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ కొలీజియం ప్రతిపాదించిన 14 పేర్లు ఇప్పటికీ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, కొలీజియం పునరుద్ఘాటించినప్పటికీ వాటిలో ఐదు పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. 'ఈ బదిలీలు తప్పక జరగాలి. లేకుంటే అది వ్యవస్థలో విపరీతమైన క్రమరాహిత్యాన్ని సృష్టిస్తుంది' అని జస్టిస్ ఎస్‌కె కౌల్ అన్నారు.

సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. అటార్నీ జనరల్ ఇచ్చిన హామీలపై చర్యలు తీసుకోకుండా కోర్టు కొరడా ఝుళిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కేసు తదుపరి విచారణను నవంబరు 20కు వాయిదా వేసింది.

# కాంగ్రెసోళ్లను నమ్మొద్దు

(మొదటిపేజీ తరువాయి)

అమ్ముకున్నారని కాంగ్రెస్ పార్టీ నేతలే లొల్లి పెడుతున్నారని, అలాంటి వారికి రాష్ట్రాన్ని అప్పగిస్తే రేపటి పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలన్నారు.

**ఒక్కో విద్యార్థిపై రూ.1.25 లక్షల ఖర్చు**

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని కేసీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 1019 గురుకులాలు ఏర్పాటు చేసి, ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.1.25లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. మైనార్టీల అభివృద్ధికి కూడా అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నామని తెలిపారు. గడిచిన పదేండ్లలో రూ.12వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో 93లక్షల తెల్ల రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యంతో పాటు త్వరలో బీమా సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. గతంలో వానాకాలం వచ్చిందంటే మంచం పట్టిన మన్యం అని పత్రికల్లో వచ్చేదని, ఇప్పుడు ఆసిఫాబాద్‌లో మెడికల్ కాలేజీ, వంద పడకలతో ఆస్పత్రి వచ్చాయని తెలిపారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో పోరాడిన కుమురం భీం జిల్లాకు పెట్టుకున్నామని తెలిపారు. చెన్నూరులో చెల్లని రూపాయి, బెల్లంపల్లిలో చెల్లుతుందా అని కాంగ్రెస్ అభ్యర్థిపై వ్యంగాస్త్రాలు సంధించారు.

**మొరాయించిన హెలికాప్టర్.. బస్సులో ఆసిఫాబాద్‌కు..**

కాగజ్‌నగర్ సభ అనంతరం సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్‌కు బయలుదేరేందుకు హెలికాప్టర్ మొరాయించింది. సీఎం కూర్చున్న తర్వాత హెలిక్యాప్టర్ మొరాయించడంతో దిగి రోడ్డు మార్గంలో బస్సులో ఆసిఫాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. సాంకేతికలోపాన్ని సవరించిన అనంతరం హెలికాప్టర్ ఆసిఫాబాద్‌కు బయల్దేరింది. బహిరంగ సభల్లో ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, దుర్గం చిన్నయ్య, ఆసిఫాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆదిలాబాద్ జడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, మాజీ ఎంపీ గొడం నగేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కసారి మాత్రమే నీటి సరఫరా ఉండేదనీ, ప్రస్తుతం ప్రతిరోజూ సరఫరా ఉందని తెలిపారు. 24 గంటల పాటు నీటి సరఫరా చేయాలనేది తమ ఆలోచన అని తెలిపారు. స్థిరమైన ప్రభుత్వం ఉన్నందువల్లే ఇతర రాష్ట్రాల నుంచి పరిశ్రమలు ఇక్కడికి తరలివస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్థిరంగా లేకపోతే ముందుగా దెబ్బతినేవి పరిశ్రమలేనని చెప్పారు. అవినీతి లేకుండా తమ ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించిందని కేటీఆర్ తెలిపారు.

## గజ్వేల్, కామారెడ్డిలలో... సీఎం కేసీఆర్ నామినేషన్

(మొదటిపేజీ తరువాయి)

గం.1.40కి కామారెడ్డికి బయలుదేరుతారు. గం.2 నుంచి గం.3 మధ్య కామారెడ్డిలో నామినేషన్ వేస్తారు. సాయంత్రం గం.4 నుంచి గం.5 మధ్య కామారెడ్డి ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తారు.

**రేపు సిరిసిల్లలో కేటీఆర్ నామినేషన్**

తెలంగాణ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా రేపే నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం గం.11.45 నిమిషాలకు ఆయన రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందించనున్నారు.

### భయపెడుతున్న
## డీప్ ఫేక్ టెక్నాలజీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ డీప్ ఫేక్ టెక్నాలజీ ఆందోళన కలిగిస్తోంది. ఫేక్ వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తారని నాయకులు భయపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం హీరోయిన్ రష్మిక మందన కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే అది తన వీడియో కాదని ఫేక్ వీడియో అని స్పష్టం చేశారు. ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ జరా పటేల్ ను రష్మిక ముఖంతో రీప్లేస్ చేశారని తెలిసింది. తాజాగా ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు కూడా ఈ టెక్నాలజీ బారిన పడ్డారు. ప్రముఖ కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి డీప్ ఫేక్ వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. సీఎం కేసీఆర్ రాజకీయ పార్టీ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)పై కాంగ్రెస్ సీనియర్ నాయకుడి డీప్‌ఫేక్ పరువు నష్టం కలిగించే, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినట్లు ఇందులో పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి తర్వాత బీఆర్ఎస్ నాయకుడు, మంత్రి మల్లా రెడ్డి డీప్‌ఫేక్ ఏఐ రూపొందించిన వీడియోలో డ్యాన్స్ చేస్తూ, రాబోయే తెలంగాణా ఎన్నికలు 2023లో "కేసీఆర్‌కి ఓటు వేస్తే మీకు ఉద్యోగాలు వస్తాయి" అని చెప్పడం చూడొచ్చు. కొన్ని పార్టీలు మిమిక్రీ అర్టిస్టులను నియమించుకుని ఫేక్ వీడియోలు రూపొందించే ప్లాన్ లో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. సో సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలన్ని నిజం కాదు.. గుర్తుంచుకోవాలని సైబర్ నిపుణులు చెబుతున్నారు. ఫేక్ వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ ఫేక్ వీడియోలు ఎన్నికల వరకే పరిమితం కావని హెచ్చరించారు. భవిష్యత్ లో సెలబ్రిటిలపై ఫేక్ వీడియోలు సృష్టించి సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫేక్ వీడియోల పట్ల పార్టీ శ్రేణులను ప్రధాన పార్టీలు అలర్ట్ చేశాయి. ఫేక్ వీడియో లాగా అనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది.

# గోప్యత జర్నలిస్టుల ప్రాథమిక హక్కు

- డిజిటల్ పరికరాల స్వాధీనం తీవ్రమైన అంశం
- ఏజెన్సీలతో నడిచే ప్రభుత్వం కాకూడదు
- నెల రోజుల్లో మార్గదర్శకాలు : కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ - విజయనేత్ర

పాత్రికేయులు వార్తలు, కథనాల సమాచారం కోసం అనేక వనరులపై ఆధారపడుతుంటారని, ఆ విషయంలో గోప్యత పాటించడం వారి ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు తెలిపింది. మీడియాలో పనిచేసే జర్నలిస్టులు, ఉద్యోగులు వార్తలను సేకరించేందుకు సోర్సుల కాంటాక్టులు కలిగివున్న డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకోవడం అత్యంత తీవ్రమైన అంశమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. దర్యాప్తు కోసం వారి పరికరాలను స్వాధీనం చేసుకోవాల్సి వస్తే.. అందుకు ప్రత్యేకమైన మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. దేశంలోని దర్యాప్తు సంస్థలు జర్నలిస్టులను విచారించేందుకు, వారి నుంచి పత్రాలు, హార్డ్ డిస్కులు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటివి స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక విధివిధానాలను రూపొందించాలని కోరుతూ ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజరు కిషన్ కౌల్, జస్టిస్ సుధాంషు ధులియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఇది చాలా తీవ్రమైన అంశం. మీడియా ప్రొఫెషనల్స్ డిజిటల్ పరికరాల తనిఖీలు, స్వాధీనం కోసం ప్రత్యేకమైన మార్గదర్శకాలు ఉండాలి. మీడియా వ్యక్తులకు వారి సొంత సోర్సులు ఉంటాయి. గోప్యత హక్కు అనేది ప్రాథమిక హక్కు. దానిలో సమతుల్యం పాటించాలి" అని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది.

జర్నలిస్టు డిజిటల్ పరికరాల స్వాధీనం కోసం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని ఈ సందర్భంగా కేంద్రానికి సూచించింది. ఇందుకోసం నెల రోజుల గడువు ఇస్తున్నట్టు తెలిపింది. "మీరు కోరుకుంటే మేం మార్గదర్శకాలను రూపొందిస్తాం. కానీ మీరు చేస్తే బాగుంటుందని అనుకుంటున్నాం. ఏజెన్సీలతో నడిచే ప్రభుత్వం కాకూడదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు సమాధానమిస్తూ.. ఇలాంటి పరికరాలను పరిశీలించకుండా అధికారులను ఆపలేమని అన్నారు. అయితే ఎలాంటి మార్గదర్శకాలు లేనప్పుడు ఇలాం టి అంశాలపై ప్రభుత్వానికి అధిక అధికారాలు ఇస్తే అది ప్రమాదకరమని ధర్మాసనం పేర్కొంది. అనంతరం ఈ పిటిష న్‌పై తదుపరి విచారణను డిసెంబరు 6కి వాయిదా వేసింది.

"దేశంలో చాలా మంది పాత్రికేయులు ప్రతీకార దాడులు జరుగుతాయనే భయంతో పనిచేస్తున్నారు. జాతీ య, అంతర్జాతీయ అంశాలకు సంబంధించి కొంతమంది జర్నలిస్టులు రాసే వార్తలను ప్రభుత్వం అంగీకరించడంలేదు. వారిని కట్టడి చేసేందుకు సోదాల పేరిట ప్రతీకార దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తోంది" అని ఇటీవల 15 మీడియా సంస్థలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్‌కు లేఖ రాశాయి. ఇటీవలి న్యూస్‌క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్‌లో పనిచేసే 46 మంది జర్నలిస్టులు, ఉద్యోగుల ఇండ్లలో ఢిల్లీ పోలీసులు సోదాలు చేసి, వారి డిజిటల్ పరికరాల(ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్కులు)ను స్వాధీనం చేసుకున్న విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు.

## సంపాదకీయం

### సమ్మతిని అతిగా
# అన్వయించుకోవద్దు

కేరళలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రభుత్వానికి, గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు మధ్య వివాదం పరాకాష్ఠకు చేరింది. కేంద్రం కక్ష సాధింపు సాధనాలుగా గవర్నర్లు దుర్వినియోగపడుతున్నారు. గవర్నర్ సమ్మతి మేరకే రాష్ట్ర ప్రభుత్వాలు మనుగడ సాగిస్తాయి అని రాజ్యాంగంలో వున్న వాక్యాన్ని ఈ రాష్ట్రాల గవర్నర్లు అతిగా అన్వయించుకొంటున్నారు. ఈ సమ్మతి అనేది శాసన సభల్లో సంఖ్యాధిక్యత కలిగిన ప్రభుత్వాల విషయంలో అప్రమేయంగా పని చేయవలసి వుంటుంది. సుప్రీంకోర్టు చేసిన ఒక వ్యాఖ్య గవర్నర్లకు స్పష్టంగా దిశానిర్దేశం చేస్తున్నది. శాసన సభలో ఆమోదించి పంపిన బిల్లులపై న్యాయస్థానాలు జోక్యం చేసుకొనేంత వరకు గవర్నర్లు నిర్ణయం తీసుకోకపోడం అలవాటైపోయిందంటూ అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది.'ఇది చాలా తీవ్రమైన సమస్య, దీనిని కూలంకషంగా పరిశీలించాలి. గవర్నర్లు తమ పని తాము చేసేటట్టు చూడడానికి సుప్రీంకోర్టును ఆశ్రయించవలసిన పరిస్థితి ఎందుకు తలెత్తాలి? రాజ్యాంగం అవతరించినప్పటి నుంచి మనది ప్రజాస్వామ్య దేశం. ఇటువంటి సమస్యలను గవర్నర్లు, ముఖ్యమంత్రులు కలిసి పరిష్కరించుకోవాలి. రాజ్యాంగం ఎటువంటి ఆటంకాలు లేకుండా అమలయ్యేటట్టు చూస్తాము' అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారంటే ఇక ముందు ఏ రాష్ట్ర గవర్నరూ జాప్యందారీ వ్యూహాలను ప్రయోగించరాదని ఆయన అనుమానాతీతంగా చెప్పారు.పంజాబ్ ప్రభుత్వం అక్కడి గవర్నర్ బన్వరీ లాల్ పురోహిత్ వైఖరిని సవాలు చేస్తూ దాఖలు చేసుకొన్న పిటిషన్‌పై విచారణలో ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతనే గవర్నర్ల బరి తెగింపు ఈ స్థాయికి చేరుకొన్నదని చెప్పక తప్పదు. తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల గవర్నర్లు కూడా అక్కడి శాసన సభల ఆమోదంతో తమకు చేరిన బిల్లులపై నిర్ణయాలు తీసుకోకుండా వాటిని నిరవధికంగా తమ వద్ద వుంచుకొన్న సందర్భాలున్నాయి. అప్పుడు కూడా ఆ ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించవలసి వచ్చింది. పంజాబ్‌లో ఆర్థిక బాధ్యత, పన్ను చట్టాల సవరణ అంశాలకు సంబంధించినవి సహా అనేక కీలక బిల్లులను గవర్నర్ ఎప్పటికీ తేల్చకుండా తన వద్ద వుంచుకొన్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తుతూ బిల్లులను తిప్పి పంపడం వరకే గవర్నర్లు చేయవలసిన పని. మంత్రి వర్గాలు వాటిని తిరిగి ఆమోదం కోసం పంపితే గవర్నర్లు కాదనడానికి వీలు లేదు. ఎందుకంటే ప్రజలెన్నుకొన్న శాసన సభలో మెజారిటీ అనుభవిస్తున్న ప్రభుత్వం అదే సభ ఆమోదం పొంది పంపే బిల్లులు శిలాశాసనాల వంటివి.వాటిని అడ్డుకొనే స్వేచ్ఛ కేంద్ర ప్రభుత్వం నియమించే గవర్నర్లకు ఎంత మాత్రం లేదు. కేరళ ప్రభుత్వానికి, గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు అనేక అంశాల మీద అసఖ్యత, వైరుధ్యం నెలకొని వున్నాయి. కెఎన్ బాలగోపాల్ అనే మంత్రి తన సమ్మతిని కోల్పోయాడని చెబుతూ ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని గవర్నర్ 2022 అక్టోబర్ 25న ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు లేఖ రాశారు. కేరళ విశ్వవిదాలయాల తీరుపై గవర్నర్ తరచూ విమర్శించడాన్ని ప్రస్తావిస్తూ కొంత మంది ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లోని పద్ధతులకు అలవాటుపడిపోయి కేరళ యూనివర్శిటీల ప్రజాస్వామ్య ప్రవర్తనను అర్థం చేసుకోలేకపోతున్నారని మంత్రి బాలగోపాల్ వ్యాఖ్యానించినందుకు ఆయనను మంత్రి వర్గం నుంచి తొలగించాలని గవర్నర్ సిఫారసు చేశారు. దానిని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖాతరు చేయలేదు. 2020లో విజయన్ ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగంలోని పౌరసత్వ చట్ట సవరణకు సంబంధించిన భాగాన్ని శాసన సభలో చదవకుండా వదిలిపెట్టడం ద్వారా గవర్నర్ వివాదాస్పదుడయ్యారు. విజయన్ ప్రభుత్వం పౌరసత్వ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శాసన సభలో ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. కేరళ ప్రభుత్వం శాసన సభలో ఆమోదింపజేసి పంపిన 8 లేక 9 బిల్లులను గవర్నర్ ఏ నిర్ణయమూ తీసుకోకుండా తన వద్ద వుంచుకొన్నారు. వీటిలో 3 బిల్లులు రెండేళ్ళకు పైగా ఆయన వద్ద పెండింగ్‌లో వున్నాయి. విశ్వవిద్యాలయ చట్ట సవరణ బిల్లులు, కేరళ సహకార సంఘాల సవరణ బిల్లు, లోకాయుక్త సవరణ బిల్లు, ప్రజారోగ్య సవరణ బిల్లు వంటివి కేరళ రాజ్‌భవన్‌లో గుర్రు నిద్ర తీస్తున్నాయి. కొన్ని బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకొన్నారని వివరమైన సమాచారాన్ని ఈ వారాంతానికి తెలియజేస్తానని పంజాబ్ కేసులో సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు విన్నవించుకొన్నట్టు తెలుస్తున్నది. గవర్నర్లపై ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వం నుంచి ఇటువంటి హామీయే రావడం ఆ తర్వాత గవర్నర్లలో చలనం కలగడం జరుగుతున్నది. ఇదంతా ప్రజాప్రభుత్వాల పనిని అడ్డుకోడానికి, అనవసరమైన కాలయాపనకు దారి తీసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది.

### ఆరు నూరైనా
# కిషన్ రెడ్డి గెలుపు ఖాయం

### మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేష్



**యాచారం- ప్రభాత సూర్యుడు :** యాచారం మండలం తక్కలపల్లి గ్రామంలో ఇబ్రహీంపట్నం నియోజక వర్గ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి గెలుపు కోసం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి మల్లేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను సిసి రోడ్లు అండర్ డ్రైనేజీ డ్వాక్రా భవనాలు ఆసరా పింఛన్లు రైతుబంధు రైతు బంధు కెసిఆర్ కిట్టు ప్రతి గ్రామంలో ఏదో ఒక రూపంలో ప్రతి ఇంటికి కెసిఆర్ పథకం లబ్ధి పొందినారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అద్యక్షులు, సీనియర్ నాయకులు , గ్రామ సర్పంచ్.గ్రామ కార్యకర్తలు సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

## పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నీలం మధు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఊరేగింపు

- తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ రుణం తీర్చుకుంటాను
- రాష్ట్ర పార్టీ పెద్దల ఆదేశానుసారం నడుచుకుంటాను
- భారీ మెజారిటీతో పటాన్ చెరువు లో గెలవడం ఖాయం
- బంగారుగడ్డ,ఆనంద్ నగర్, ఐలాపూర్, ఇంద్రేశం ప్లాట్ ల ఓనర్లకు న్యాయం చేస్తా






**పటాన్‌చెరు - ప్రభాత సూర్యుడు**

పటాన్‌చెరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న నీలం మధు ఆధ్వర్యంలో కొత్త, పాత కాంగ్రెస్ కార్యకర్తలతో పెద్ద ఎత్తున ఊరేగింపుగా గాంధీభవన్ చేరుకొని కాంగ్రెస్ చీఫ్ రేవంత్ రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గంలో బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యే గా ఉన్న గూడెం మహిపాల్ రెడ్డి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. గూడెం బ్రదర్స్ గా పేరు తెచ్చుకొని పటాన్చెరు ప్రాంతంలో విలువైన భూములపై కన్నేసి అక్రమంగా వేల కోట్లు సంపాదించారని అన్నారు. ప్రభుత్వ భూములను సైతం వదల లేదని అన్నారు. ఈ అన్ని అక్రమాలపై న్యాయ విచారణ జరిపిస్తామని అన్నారు. అహంకారి గూడెం మహిపాల్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని అన్నారు. అక్రమంగా సంపాదించిన వేల కోట్ల రూపాయలను ఈ ఎన్నికల్లో ఖర్చు చేసి ఓటర్లను కొని దొడ్డి మార్గంలో ఎమ్మెల్యే గా తిరిగి గెలవాలని కంటున కలలు కలగానే మిగులుతుందని అన్నారు. పటాన్చెరులో భారతీయ జనతా పార్టీ నామమాత్రం పార్టీ అని డిపాజిట్ కూడా దక్కదని అన్నారు. నూతన ప్రభుత్వం రాగానే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి మెట్రో రైలును మియాపూర్ నుంచి రుద్రారం ట్రిబుల్ ఐటీ వరకు పొడిగించడానికి కృషి చేస్తానని అన్నారు. అలాగే ఎం ఎం టి ఎస్ రైలును జాతీయ రహదారి ఇక్రిసాట్ సర్వీసు రోడ్డు ప్రాంతంలో రైల్వే స్టేషన్ ను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను అరికట్టి, రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తానని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇంటి కలను నెరవేరుస్తానని అన్నారు. నియోజకవర్గ పరిధిలో గత 15 సంవత్సరాల నుంచి బి ఆర్ ఎస్ పార్టీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల ఉన్న బిసి ముదిరాజ్ సామాజిక వర్గానికి బి ఆర్ ఎస్ పార్టీ ఒక్క సీటును కూడా ఇవ్వకపోవడంతో తన అనువాయిలు అవాక్కు అయ్యారని అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ తనకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో తనకున్న ప్రజాదరణను సర్వేల రూపంలో చూసి ఏఐసీసీ అధిష్టానం తనను ఢిల్లీకి పిలిచి కాంగ్రెస్ టికెట్ పై పటాన్చెరువు లో పోటీ చేయాలని జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కోరడంతో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని అన్నారు. వెనువెంటనే పటాన్చెరువు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ టికెట్ పై పోటీ చేయమని ఏఐసీసీ మరియు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కమిటీ పెద్దలు, పెద్ద మనసుతో ఆదేశించడంతో వారి ఆదేశానుసారం ఎన్నికల బరిలో ఉన్నానని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీకి, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ కర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ప్రత్యేకంగా రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ బట్టి విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డి తదితరుల పెద్దలందరికీ జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. తనకు టికెట్టు రావడం కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా, సహాయము చేసిన అందరికీ రుణపడి ఉంటాను అని అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అమ్మ సోనియా గాంధీ రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ అయిన పెద్దలు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన 6 గ్యారంటీలను సుడిగాలిలా పర్యటించి నియోజకవర్గ పరిధిలోని గడప గడపకు ఆరు గ్యారెంటీలను తీసుకపోతామని ప్రతి తల్లికి ప్రతి తండ్రికి అన్నా తమ్ముళ్లకు చేరువ అవుతామని అందరి మద్దతును కూడగట్టుకుని అత్యధిక మెజారిటీతో పటాన్చెరులో కాంగ్రెస్ జెండాను ఎగురవేసి, గెలిసి, ఏఐసిసి పెద్దలకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పెద్దలకు కానుకగా ఇచ్చి అమ్మ సోనియాగాంధీ రుణమును తీర్చుకుంటానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60 లక్షల మంది ముదిరాజు సహోదరులు ఆత్మగౌరవాన్ని కాపాడుకొని రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి అందరినీ గెలిపించి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ముదిరాజు బంధువులు కసిగా పనిచేయాలని అన్నారు. దురహంకార కేసీఆర్ ,బి ఆర్ ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టాలని అన్నారు. గాంధీభవన్ లో ఉన్న పెద్దలందరి ఆశీర్వాదం తీసుకోవడానికి వచ్చామని అన్నారు.

### అమీన్ పూర్ మున్సిపాలిటీలో
# బిఆర్ఎస్ నుండి కాంగ్రెసులోకి భారీగా చేరికలు

**- కౌన్సిలర్ కొల్లూరి మల్లేష్**



బుధవారం గాంధీభవన్లో కొల్లూరు మల్లేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ లోకి చేరుతున్న బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు

పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్పూర్ మున్సిపాలిటీలో బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లోకి భారీ ఎత్తున చేరుతున్నారని అమీన్పూర్ మాజీ ఉప సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత మున్సిపాలిటీ కౌన్సిలర్ కొల్లూరు మల్లేష్ ప్రభాత సూర్యుడుతో మాట్లాడుతూ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కెసిఆర్ ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో సంపండ కులాలు, వర్గాలు, ఏకతాటి పైకి వచ్చాయని అన్నారు. పటాన్ చెరువులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని, నీలం మధు ముదిరాజ్ అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలువబోతున్నట్లు తెలిపారు. గత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న గూడెం మహిపాల్ రెడ్డి తన అణువాయువులకే మేలు చేశారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజల మౌలిక సదుపాయాల విషయంలో ఎటువంటి న్యాయం చేయలేదని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు ఇప్పించలేకపోయాడని అన్నారు. ఇచ్చిన కొన్ని కూడా ఎమ్మెల్యే అనుకూలులకే ఇచ్చారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదంతో అధికారంలోకి వచ్చిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రభుత్వం అన్ని రంగాలలో అవినీతికి పాల్పడుతూ ప్రజా వ్యతిరేక మూటను ముళ్లగట్టుకున్నాడని అన్నారు. నియోజకవర్గంలోని బీసీ లోని అన్ని వర్గాలు, అన్ని కులాలు ఏకతాటి పైకి వచ్చాయని మైనార్టీలు సైతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధుకు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. పటాన్చెరువు నియోజకవర్గంలోని గుమ్మడిదల, బొల్లారం జిన్నారం, అమీన్పూర్ రామచంద్రపురం, తెల్లాపూర్, కొల్లూర్, ఉస్మాన్ నగర్, పటాన్ చెరువు తదితర ప్రాంతాల్లోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు నీలం మధుకు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీకి కాంగ్రెస్ గెలుపును బహుమానంగా ఇస్తామని అన్నారు. ఇస్నాపూర్, అశోక్ నగర్, పటాన్చెరు, బీరంగూడ, బీహెచ్ఈఎల్, ఎమ్ఐ జి హెచ్ ఐ జి, ఎల్ ఐ జి, బి డి ఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, కర్తనూరు, భానురు, ఇంద్రేశం, చిన్న కంజర్ల, పెద్ద కంజర్ల, రుద్రారం, పాశమైలారం, క్యాసారం తదితర ప్రాంతాలలో ఇతర రాష్ట్రాల నుండి వచ్చి వృత్తిరీత్యా, వ్యాపార రీత్యా, ఉపాధి రీత్యా, స్థిరనివాసమే ఏర్పాటు చేసుకున్న వారందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. 40 నుండి 50 వేల ఓట్లు కాంగ్రెస్ పార్టీకి పడనున్నట్లు తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గంలో ముదిరాజుల ఓట్లు 60000 ఉన్నట్లు గంపగుత్తగా నీలం మధుకు ఓట్లు వేస్తారని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు కేసీఆర్ ప్రభుత్వ పాలనపై కక్ష తీసుకోవాలని కసితో ఉన్నారని అన్నారు. పటాన్ చెరువులో నీలం మధు గెలుపును ఏ శక్తి ఆపలేదని అన్నారు.

## ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసిన కేసీఆర్



**చిన్న శంకరంపేట్ -ప్రభాత సూర్యుడు:** సీఎం కేసీఆర్ యువతకు ఉద్యోగాలు,పేదలకు డబుల్ బెడ్ రూములు దళితులకు మూడు ఎకరాలు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కిందని కాంగ్రెస్ మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల గోపాల్ రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ కు ప్రజలు గుణపాఠం చెప్పి కాంగ్రెస్ ను భారీ మెజార్టీతో గెలిపి%శీ%చి మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, వడ్ల రాజు, శేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మాణిక్యం, యాదగిరి, గాల్ రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సిపిఎం బిజెపి నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరిక

### బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**మంచాల - ప్రభాత సూర్యుడు:** చిత్తాపూర్ గ్రామం నుండి రాష్ట్ర గొర్ల కాపలా సంఘం అధ్యక్షుడు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పేదల పెన్నిధి . ప్రజల నాయకుడు రావుల జంగయ్య , సిపిఎం సీనియర్ మండల నాయకులు పోలమోని నరసింహ , రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఇబ్రహీంపట్నం లో అభివృద్ధి చేసిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మంచాల్ మండల్ ఎంపీపీ నర్మదా లచ్చిరాం, మంచాల్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, చిత్తాపూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు నాగరాజు గౌడ్ తాళ్లపల్లి గూడా సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సుకన్య, శేఖర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఏర్పుల మల్లేష్ ,గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల పెద్దిరాజు ప్రధాన కార్యదర్శి ఏర్పుల శ్రీను , గ్రామ ఉపసర్పంచ్ ఉబల రేణుక. రవి ,వార్డు సభ్యులు జిల్లామోని చంద్రయ్య బిఆర్ఎస్ గ్రామ శాఖ యూత్ ప్రెసిడెంట్ ఏర్పుల అశోక్ ,సీనియర్ నేత రావుల కృష్ణ పార్టీ నాయకులు ఏర్పుల కృష్ణ, శివరాల రాములు, ఏర్పుల శ్రీ కృష్ణ, సడీవెల యాదగిరి, యూత్ సభ్యులు జిల్లమోని శివకుమార్ ,ఏర్పుల ప్రసాద్, బిఆర్ ఎస్ కుటుంబ సభ్యులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**రామన్నపేట - ప్రభాత సూర్యుడు:** టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గం రామన్నపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి కార్యకర్తలకు మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జింకల వసంత ,ప్రభాకర్ ,రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గురుకుశివ, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్, మెహబూబా అలీ, మండల కాంగ్రెస్ నాయకులు జెల్ల వెంకటేశం, కోట సుధాకర్ ,బొడ్డు శంకరయ్య, గొలుసుల ప్రసాద్, దుర్యోధన్, మహమ్మద్ జానీ, యాదయ్య, గంగాపురం శంకర్ గౌడ్, గోవర్ధన్ ,నోముల కృష్ణ ,మొహమ్మద్ ఇంతియాజ్ ,ఖలీల్ ,నరసింహ ,సీనియర్ నాయకులు అయ్యాడపు నర్సిరెడ్డి ,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండంలో చతుర్ముఖ పోటీ

**కరీంనగర్-ప్రభాత సూర్యుడు**



రామగుండంలో ఎన్నికల కోలాహలం ఊపందుకుంది. ఎక్కడ చూసినా.. ప్రచారాల హోరు జోరుగా కొనసాగుతోంది. పలుచోట్ల నువ్వా.. నేనా.. అనే రీతిలో అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. ఈ క్రమంలో రాజకీయ వాతావరణం రోజు రోజుకి వేడెక్కుతోంది. ఎన్నికల్లో కీలకంగా మారిన సింగరేణి కార్మికుల ఓట్లపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి.రాష్ట్ర రాజకీయాల్లో రామగుండం రూటే సపరేటు. సందర్భం ఏదైనా, ఈ ప్రాంతం ఒక ప్రత్యేకతను చాటుకుంటూ వస్తుంది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కూడా రామగుండం రాజకీయ రణ రంగానికి వేదికగా మారింది. సమీపిస్తున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అభ్యర్థులు వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు సాగుతున్నారు.ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే, కోరుకంటి చందర్, కాంగ్రెస్ అభ్యర్థి మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి పోటీ పడుతున్నారు. వీరికి ధీటుగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ కూడా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి పరాజయాన్ని చవి చూసిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోరుకనీటి. చందర్ 2018 ఎన్నికల్లో టీఅర్ఎస్ రెబల్గా పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ వెంటనే గులాబీ గూటికి చేరి ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యేగా రామగుండంలో తాను సాధించిన అభివృద్ధి తన గెలుపుకు దోహదపడతాయని కోరుకనీటి చందర్ భావిస్తున్నారు.కాంగ్రెస్ అభ్యర్థి మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ కూడా గతంలో రెండు సార్లు పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన రాజ్ ఠాకూర్, సింపతి వేవ్స్తో విజయం సాధిస్తాననే అంచనాలతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత తనకు లాభిస్తుందని రాజ్ ఠాకూర్ అంచనా వేసుకుంటున్నారు. ఇక, సుదీర్ఘకాలంగా బీఆర్ఎస్ లో ఉండి ఎమ్మెల్యే టికెట్ ను సాధించడంలో ఆశాభంగానికి గురైన కందుల సంధ్యారాణి, ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా తొలిసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. సిట్టింగ్ ఎమ్మెల్యే పట్ల ఉన్న వ్యతిరేకత తనకు లాభించడంతోపాటు ఆడపడుచుగా ఈ ప్రాంత ప్రజలు ఆదరిస్తారన్న ధీమాతో సంధ్యారాణి ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.ఇక రామగుండం మున్సిపల్ తొలి చైర్మన్ గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన సోమారపు. సత్యనారాయణ గత ఎన్నికల్లో టీఅర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి, రెబల్ అభ్యర్థి కోరు కంటి చందర్ చేతిలో పరాజయం పాలయ్యారు. ప్రస్తుతం స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. గతంలో తాను సాధించిన అభివృద్ధితోపాటు వయసు రిత్యా ఇవే తనకు చివరి ఎన్నికలు కావడంతో ప్రజలు ఆదరించే అవకాశాలు ఉన్నాయని సోమారపు సత్యనారాయణ బలంగా భావిస్తున్నారు. స్థానికంగా ఉన్న రెండు లక్షల 14 వేల పైచిలుకు ఓట్లలో విన్నింగ్ ఫిగర్ను చేరుకునేందుకు ప్రధాన పోటీదారులందరూ అలుపెరుగని ప్రచారాలను నిర్వహిస్తున్నారు. స్థానిక పరిస్థితులు, ప్రజలు, కార్మికుల ఆకాంక్షలను ప్రధాన అస్త్రాలుగా ఎంచుకొని ఓటర్లలో పట్టుకోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.పరిశ్రమలకు నిలయమైన రామగుండంలో సింగరేణి కార్మిక కుటుంబాల ఓట్లే కీలకం.. నియోజకవర్గంలోని మొత్తం ఓట్లలో 35 నుండి 40% ఓట్లు సింగరేణి కార్మిక కుటుంబాలవే కావడంతో వారి మద్దతు కోసం అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులైన కోరుకంటి చందర్, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కందుల సంధ్యారాణితో పాటు స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ కూడా ప్రచారంలో పదును పెంచడంతో స్థానికంగా చతుర్ముఖ పోటీ తప్పదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకరికి దీటుగా మరొకరు ప్రచారాన్ని హోరెత్తిస్తుండడంతో ఈ నలుగురు అభ్యర్థుల మధ్య పోటీ నువ్వా.. నేనా.. అనే రీతిలో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రచార సరళి, ప్రజల నుండి లభిస్తున్న ఆదరణను బట్టి పైకి ఎవరికివారు గెలుపు పట్ల ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ, అంతర్గతంగా విజయావకాశాలు అభ్యర్థులందరినీ హై టెన్షన్ కు గురిచేస్తున్నాయి.ఐతే, ఎన్నికల్లో ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతోనే బయటపడే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు

# స్టార్ క్యాంపెయినర్ లిస్ట్ లో రాములమ్మ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

బీజేపీ మహిళా నేత విజయశాంతి కమలం పార్టీలో కొనసాగాలా లేకుంటే కండువా మార్చేయాలా..? అని ఆలోచిస్తున్నారా? .... ఎన్నికల ముందు రాములమ్మ కీలక నిర్ణయం తీసుకోనున్నారా ... అంటే ఔననే సమాధానం వస్తోంది ... గత కొంత కాలంగా బీజేపీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. బీజేపీ తీరుతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారంట .... దానికి తగ్గట్లే బీజేపీ తీరుని వ్యతిరేకిస్తున్నట్లు ఆమె ట్వీట్లు చేస్తుండటం ఆ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తోంది ... ఆ క్రమంలో రాములమ్మకు హైకమాండ్ ప్రకటించిన బీజేపీ స్టార్ క్యాంపెయినర్స్ జాబితాలో చోటు దక్కలేదు .. దాంతో ఆమె పార్టీ ఖాయమన్న ప్రచారంతో రాష్ట్ర నాయకత్వం కంటితుడుపు చర్యకు ఉపక్రమించింది.. మరి దీంతో ఆమె శాంతిస్తారా?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ విజయశాంతికి తన సొంత పార్టీ బీజేపీలో అవమానాలు ఎదురవుతున్నాయనే కామెంట్లు వినిపిస్తున్నాయి ... తెలంగాణ కోసం సొంత పార్టీ మరీ పెట్టుకుని పోరాడిన మహిళా నాయకురాలిగా.. తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న రాములమ్మ ఇప్పుడు రాజకీయ అవకాశాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందనే చెప్పుకోవాలి... దీంతో ఆమె వరుసగా అవమానాలకు గురవుతున్నారని ఆమె అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు .... ఈ క్రమంలో బీజేపీ నుంచి మరోసారి ఆమెకు అవమానం జరిగింది... ఢిల్లీ పెద్దలు ప్రకటించిన బీజేపీ స్టార్ క్యాంపెయినర్ లిస్టులో విజయశాంతి పేరు కనిపించలేదు .. దాంతో ఆమె పార్టీ మార్పుపై డెసిషన్ తీసుకుంటారన్న ప్రచారంతో .. రాష్ట్ర బీజేపీ నేతలు కవర్ చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు .. కంటితుడుపు చర్యకు ఉపక్రమించారు!

విజయశాంతి రాజకీయాల్లోకి వచ్చి 25 ఏళ్లు అవుతోంది .. బీజేపీలో చేరి మూడేళ్లు కావొస్తోంది ... అయితే.. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఒకే ఒక్కసారి మాత్రమే ఎంపీగా సేవలందించే అవకాశం ఆమెకు దక్కింది.. అది కూడా టీఆర్ఎస్ చలవే.. అప్పట్లో కారు గుర్తుతో ఆమె మెదక్ ఎంపీగా పోటీ చేసి గెలిచారు .. ఇక ఆ తర్వాత 2014లో మెదక్ నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు... మరి ఈసారైనా బీజేపీ నుంచి అవకాశం దక్కుతుందా అనుకుంటే.. అది కూడా ఎండమావిలాగే కనిపిస్తోందనే కామెంట్లు వినిపిస్తున్నాయి.



బీజేపీ పెద్దలు తెలంగాణ ఎన్నికల కోసం ఇప్పటికే మూడు జాబితాలు ప్రకటించగా.. ఎందులోనూ ఆమె పేరు కనిపించలేదు .... ఇక జనసేనతో పొత్తుతో ఆ పార్టీనేతలకూ 8 స్థానాలు కేటాయించారు .ఇక కాషాయ పార్టీ ప్రకటించాల్సినవి 23 స్థానాల అభ్యర్థులనే.. మిగిలిన ఆస్థానాల్లో అయినా ఆమెపేరు ఉంటుందా ఉండదా అనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.ఇలాంటి తరుణంలో బీజేపీ తెలంగాణ ఎన్నికల కోసం స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో ఊహించని విధంగా ఆమె పేరు మాయమైంది.

తెలంగాణ ఎన్నికల్లో స్టార్ క్యాంపెనిర్ల జాబితాలో ఆమెతో పాటు.. తెలంగాణ బీజేపీలో లాజికల్ గా, పిన్ టు పిన్ మాట్లాడగల వక్తగా పేరున్న రఘునందన్ రావు పేరు కూడా లేకపోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది.. దీంతో తెలంగాణలో బీజేపీ పరిస్థితి ఒకడుగు ముందుకి.. నాలుగడుగులు వెనక్కి అన్నట్లు తయారువావడానికి కారణం... ఇలాంటి నిర్ణయాలే అనే టాక్ మొదలైంది... విజయశాంతి వాక్ చతుర్యం.. రఘునందన్ సబ్జెక్ట్ నాలెడ్జ్ బీజేపీకి అవసరం లేదా.. ఇప్పుడున్నవారంతా అంతకు మించిన వక్తలా అనే చర్చ కూడా తెరపైకి వచ్చింది.

దీంతో రాష్ట్ర పార్టీ నాయకత్వం ఈ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది .. దీంతో స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో మార్పులు చేసి ఆఖరికి విజయశాంతి, రఘునందన్ రావు పేర్లను చేర్చి మరో ప్రకటన విడుదల చేశారు .

ఆ క్రమంలో మొత్తం 42 మంది నేతలు తెలంగాణలో బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిం చనున్నారు ... వీరిలో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. ఇక రాష్ట్ర నేతల జాబితాలో... కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్, రాజా సింగ్, లక్ష్మణ్, డీకే అరుణ, ఎంపీ అరవింద్, జితేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వంటి వారు కూడా ఉన్నారు. అయితే వీరందరి పేర్లు తొలిజాబితాలో ఉన్నప్పటికీ... విజయశాంతి, రఘునందన్ ల పేర్లు లేవు. దీంతో... ఉద్దేశపూర్వకంగానే విజయశాంతిని పక్కనపెట్టారని ప్రచారం జరిగింది... ఇప్పుడు ఆ ఇద్దరి పేర్లు కూడా లిస్టులో చేర్చారు కమలనాథులు...

ఫస్ట్ లిస్టులో పేరు లేకుండా తర్వాత కంటితుడుపుగా తన పేరు జాబితాలో చేర్చడంతో రాములమ్మ బీజేపీ ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా తయారైంది. ఇప్పటికే ఆమెకు కాంగ్రెస్ నుంచి ఆఫర్ వచ్చిందని.. లోక్ సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీ టికెట్ ఖాయం చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పి తమ పార్టీలోకి ఆహ్వానించారన్న ఊహాగానాలు చెలరేగుతున్నాయి... ఇటు చూస్తే రాములమ్మ కూడా బీజేపీ కార్యక్రమాలకు చాలా కాలంగా దూరంగా ఉంటున్నారు.. ఆ క్రమంలో ఆమె పార్టీ మారడానికే డిసైడ్ అయినట్లు కనిపిస్తున్నా రంటున్నారు.. తెలంగాణ బీజేపీకి ఉన్న ఏకైక సినీ గ్లామర్ విజయశాంతి.. మరి ఆమె కాల్షీట్ లు ఏ పార్టీకి దక్కుతాయో చూడాలి...

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215